సాక్షి
అన్నమయ్య జిల్లా

సోమవారం । 22 । ఏప్రిల్ । 2024



ఉన్నది ఒకటే జిందగీ

మార్కులు తక్కువ వచ్చాయనో లేక ఉత్తీర్ణత సాధించలేక పోయామనో విద్యార్థులు ఆత్మ హత్య చేసుకుందామన్న ఆలోచన ఏ కోశాన కూడా మదిలోకి రానివ్వకూడదు. - 8లో



నెరవేరిన పేద రోగుల కల

పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు నాడు-నేడు కింద రూ. 22 కోట్లతో వంద పడ కల సామర్థ్యం కలిగిన ఆధునిక భవనాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.260
రెండోరకం	రూ.120	రూ.188

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 170 మెట్రిక్ టన్నులు



రారండోయ్.. రాములోరి పెళ్లండోయ్!

ఏకశిలానగరం.. కానీ ఓరుగల్లు కాదు
తెలుగునాట సీతారామలక్ష్మణులు
కొలువుదీరిన పుణ్యధామం..
కానీ భద్రాద్రికాదు
వాల్మీకి రామాయణంలో కనిపించనిది..
వెన్నెల వెలుగుల్లో మురిపించేది..
ఒకే క్షేత్రం.
అదే ఒంటిమిట్ట..
ఆంధ్రప్రదేశ్‌లో అపర భద్రాచలంగా
పేరొందిన ఈ దివ్యక్షేత్రం శ్రీరామనవమి
వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వాంగ
సుందరంగా ముస్తాబైంది.

- నేడు ఒంటిమిట్టలో శ్రీ సీతారాముల కల్యాణం
- ప్రభుత్వ లాంఛనాలతో పట్టువస్త్రాల సమర్పణ
- తరలివస్తున్న ప్రముఖులు, భక్తులు



ఒంటిమిట్టలో అందంగా ముస్తాబైన కోదండరాముడి కల్యాణ వేదిక

ఒంటిమిట్ట/రాజంపేట: ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్సార్ జిల్లాలో ఉంది ఒంటిమిట్ట. చుట్టూ కొండలు, పచ్చని పంటపొలాల మధ్యలో ఉంటుంది. ఇక్కడి కోదండ రామాలయం అపురూప శిల్పసంపదతో అలరారుతోంది. ఈ దేవాలయ నిర్మాణంలో చోళరాజులు, విజయనగర రాజులు, మట్లి రాజుల కళా వైభవం కనిపిస్తుంది. రాజగోపురాలపై అందమైన శిల్పాలు కనువిందు చేస్తాయి. ఆలయ మంటపంలోని ప్రతి స్తంభం ఒక కళారూపాన్ని ప్రదర్శిస్తుంది.

చతుర్దశి నాడు.. పున్నమి వెలుగుల్లో కళ్యాణం

ఏకశిలానగరి శ్రీ కోదండ రామాలయంలో శ్రీ రామనవమి రోజు కాకుండా పండు వెన్నెల రోజు సీతారాముల కల్యాణం జరుగుతుంది. ఆ మేరకు సోమవారం రాత్రి రామయ్య పెళ్లి జరగనుంది. చిన్నతనం నుంచి దాశరథికి 'చంద్రుడు' అంటే ఇష్టం. చిరుప్రాయంలో ఆకాశంలో చంద్రున్ని చూపిస్తేనే ఆహారాన్ని ఆరగించేవాడు. రఘురాముడు చైత్ర శుద్ధ నవమి నాడు పునర్వసు నక్షత్రంలో విళంబినామ సంవత్సరంలో జన్మించాడు. ఆయన వివాహ మహోత్సవాలు అన్ని ఆలయాల్లోనూ నవమి నాడే అభిజిత్ లగ్నంలో నిర్వహిస్తారు. భద్రాచలం రామక్షేత్రంలో, తిరుపతి కోదండ రామాలయంలోనూ దాదాపు అన్ని చోట్ల చైత్ర శుద్ధ పాడ్యమి నుంచి ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. నవమి నాటి కల్యాణంతో ముగుస్తాయి. ఇలా అనేక చోట్ల పగలు రామయ్య పెళ్లి జరిగితే ఒక ఒంటిమిట్టలోనే రాత్రి వేళ నిర్వహిస్తారు. ఈ సంప్రదాయం ఇప్పటిది కాదు. ఆలయ దివ్య దర్శనం ప్రజలకు అందుబాటు లోకి వచ్చినప్పటి నుంచి ఇలాగే జరుగుతోంది.

- కోదండ రాముడు సూర్య వంశీయుడు. స్వయం ప్రతాపం కలిగినవాడు. శత్రువులు కన్నెత్తి చూడ జాలని తేజం ఉన్న వాడు. ప్రజల్ని కన్నబిడల్లా చూడాలంటే ఆయన ముఖంలో వెన్నెల కురవాలి. ప్రసన్నత, చల్లదనం కావాలి. ప్రజల్ని చల్లగా పాలించి శ్రీరాముడు శ్రీ రామచంద్రుడయ్యాడు. అలా పిలిపించుకోవడం పురుషోత్తముడికి ఆనందం. అదే సమయంలో చంద్రునికి కాసింత గర్వం కూడా. తన పేరు శ్రీరాముడికి తోడైనందుకు ఉబ్బిపోయేవాడు. పాపం, దేశమంతటా జరిగే శ్రీరామ బ్రహ్మోత్సవాల్లో శ్రీరాముడి కల్యాణాన్ని చూసే అవకాశం చంద్రుడికి లేకుండా పోయింది. సీతారామ కల్యాణం అని పేరేగాని అక్కడ చంద్రుడికి ఆహ్వానమే లేదు. చంద్రుడు ఈ బాధ భరించలేకపోయాడు. బ్రహ్మోత్సవాలకు అధినాయకుడైన బ్రహ్మకు తన ఆవేదనను నివేదించుకున్నాడు. బ్రహ్మ అందుకు తగిన ఏర్పాటు చేస్తానని భూమ్మీద ఏదో ఒకచోట అవకాశం కల్పిస్తానని మాట ఇచ్చాడు. ఏకశిలానగరిలో శ్రీరామ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. చతుర్దశి రాత్రి కళాపూర్ణుడైన చంద్రుడు సీతారామ కల్యాణాన్ని పరమానందంతో తిలకిస్తాడు.

ఇలా చేరుకోవచ్చు..

- కడప-తిరుపతి రహదారిపై ఒంటిమిట్ట ఉంది. కడప నుంచి 26 కి.మీ. దూరం ప్రయాణిస్తే ఆలయానికి చేరుకోవచ్చు.
- రైలులో రాజంపేట రైల్వేస్టేషన్‌లో దిగి బస్సులో ఒంటిమిట్టకు చేరుకునే సౌలభ్యముంది.
- కడప రైల్వేస్టేషన్‌లో కూడా రైలు దిగి బస్సు, ఇతర వాహనాల్లో ఒంటిమిట్టకు చేరుకోవచ్చు.
- తిరుపతి విమానాశ్రయం 100 కి.మీ దూరంలో ఉంది.

ప్రభుత్వ లాంఛనాలతో పట్టువస్త్రాలు..

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర భద్రాద్రిగా వైఎస్సార్ జిల్లా, ఒంటిమిట్ట మండలంలో గల ఏకశిలానగరి శ్రీ కోదండ రామాలయాన్ని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించినప్పటి నుంచి ఇక్కడ శ్రీ సీతారాముల కల్యాణం ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహిస్తున్నారు. సోమవారం జరిగే శ్రీ సీతారాముల కల్యాణానికి ప్రభుత్వ లాంఛనాలతో కోదండ రామాలయంలోని మూల మూర్తులకు పటువస్త్రాలు సమర్పిస్తారు.

కోటి తలంబ్రాలు సమర్పణ

ఒంటిమిట్టలో సోమవారం జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణానికి తూర్పు గోదావరి జిల్లా కోరుకొండకు చెందిన శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు శ్రీ కళ్యాణ అప్పారావు ఆధ్వర్యంలో గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను ఆదివారం సమర్పించారు. మొత్తం 180 కిలోల బరువైన ఈ తలంబ్రాలను ఆలయం వద్ద డిప్యూటీ ఈఓ నటేష్ బాబు, అర్చకులు శ్రావణ్ కుమార్‌ల సమక్షంలో అందించారు. ఈ సంఘం ఆధ్వర్యంలో 13 ఏళ్లుగా భద్రాద్రి రామునికి, ఏడేళ్లుగా ఒంటిమిట్ట రామునికి కల్యాణోత్సవం సందర్భంగా అందజేస్తున్నామని కళ్యాణ అప్పారావు తెలిపారు.



వరుడు: అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు దశరథమహారాజ నందనుడు సాక్షాత్తు శ్రీమన్నారాయణ స్వరూపుడు శ్రీ కోదండరామ స్వామి

వధువు: శ్రీ జనక మహారాజ స్వీకృత పుత్రిక సాక్షాత్తు లక్ష్మీ స్వరూపిణి శ్రీ సీతాదేవి

కల్యాణ వేదిక: ఏకశిలానగరం (ఒంటిమిట్ట)

కల్యాణోత్సవం: స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహన శక చాంద్రమాన శ్రీ క్రోధినామ సంవత్సర చైత్ర శుద్ధ చతుర్దశి సోమవారం చిత్రనక్షత్ర యుక్త శుభలగ్నంలో ఈనెల 22న సాయంత్రం 6.30గంటల నుంచి రా.8.30గంటల వరకు

ఏర్పాట్ల పరిశీలన

ఒంటిమిట్ట శ్రీ సీతారాముల కల్యాణ ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం జేఈఓ వీరబ్రహ్మం, జేసీ గణేష్ కుమార్, ఇతర యంత్రాంగంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జేఈఓ మాట్లాడుతూ సీతారాముల కల్యాణం సోమవారం సాయంత్రం 6.30 గంటల నుండి 8.30 గంటల మధ్యలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

చంద్రుని కనులారా కల్యాణం



చంద్రుని కనులారా రాములోరి కల్యాణం ఒంటిమిట్ట(ఏకశిలానగరం)లో జరుగుతోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒంటిమిట్టలో రాముని కల్యాణం రాత్రి పూట జరుగుతుంది. శ్రీరామకల్యాణం చూడలేకపోతున్నానే చంద్రుని ఆవేదనను శ్రీ మహావిష్ణువు ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలలో తీర్చాడని పురాణాలు చెబుతున్నాయి. – వీణా రాఘవాచార్యులు, ప్రధానఅర్చకులు, కోదండ రామాలయం.

ఒంటిమిట్ట కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

జిల్లా కలెక్టర్ వి.విజయరామరాజు



కడప సెవెన్‌రోడ్స్: చారిత్రాత్మక ప్రాశస్త్యం గల ఒంటిమిట్ట శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే కల్యాణోత్సవానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం.. జిల్లా అధికార యంత్రాంగం అన్ని రకాల ఏర్పాట్లను సంసిద్ధం చేసిందని జిల్లా కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. టీటీడీ అధికారుల సమన్వయంతో జిల్లా యంత్రాంగం అన్ని ఆరోగ్య భద్రతా చర్యలను చేపడుతోందన్నారు. ముఖ్యంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా అధికార యంత్రాంగం ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటుందన్నారు.

100 ప్రత్యేక బస్సులు

రవాణా పరంగా ఏ ఒక్కరికీ ఎలాంటి ఇబ్బందులు, కొరత లేకుండా 100 ప్రత్యేక బస్సులను పలు ముఖ్య ప్రదేశాల నుంచి రూట్ల వారీగా కేటాయించామని ఏపీఎస్ ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారి గోపాల్ రెడ్డి తెలిపారు. ఈ నెల 22వ తేదీన కల్యాణోత్సవం రోజున కడప డిపో నుంచి 35 బస్సులు, పులివెందుల 10, బద్వేలు 20, జమ్మలమడుగు 10, మైదుకూరు 05, ప్రొద్దుటూరు డిపో నుంచి 20 బస్సులు నడపనున్నారు. ఇతర రీజియన్ డిపోల నుంచి 40 బస్సులను (రాజంపేట నుంచి 30, రాయచోటి నుంచి 10) ఏర్పాటు చేశారు.

- స్వామి వారి కల్యాణం రోజున కడప వైపు నుంచి వచ్చే వాహనాల పార్కింగ్ ప్రదేశం నుంచి కల్యాణ వేదిక వరకు భక్తులను తరలించేందుకు 10 ఉచిత బస్సులను ఏర్పాటు చేశారు. అందులో రాజంపేట వైపు నుంచి వచ్చే వాహనాల పార్కింగ్ ప్రదేశం (సాలాబాద్ క్రాస్ రోడ్ నుండి హరిత హోటల్ వరకు 4 వాహనాలను, అలాగే కడప వైపు నుండి వచ్చే వారికి ముమ్మడిగుంటపల్లె సాయి బాబా గుడి నుండి కల్యాణ వేదిక వరకు 6 వాహనాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి తెలిపారు.

న్యూస్‌రీల్

కమనీయం.. పట్టాభిరాముడి పుష్పయాగం



పుష్పయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

వాల్మీకిపురం: వాల్మీకిపురం శ్రీ పట్టాభిరామాలయంలో ఆదివారం సీతారాముల పుష్ప యాగం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం మూలవర్లకు అభిషేకం, అర్చన, శుద్ధి, పంచాంగ శ్రవణం, తోమాలసేవ, మొదటి గంట, బలి, శాత్తుమొర సేవలు జరిగాయి. అనంతరం స్వామివారికి స్నపన తిరుమంజనాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. పుష్పయాగానికి సిద్ధం చేసిన 12 రకాలు 200 కేజీల పుష్పాలను తిరుమాఢవీధుల్లో ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం వాహన మండపంలో భోగోత్సవమూర్తులైన సీతాలక్ష్మణ సమేత శ్రీ పట్టాభిరాముడిని కొలువుదీర్చారు. వేదపండితుల మంత్రోచ్చరణలు, భక్తుల రామనామస్మరణల నడుమ స్వామి పుష్పయాగం కనుల పండువగా జరిపారు. టీటీడీ కళాకారుల హరికథ, సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, సిబ్బంది నాగరాజ, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌లలో పటిష్ట ఏర్పాట్లు



కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ

రాయచోటి: పోలింగ్ అనంతరం ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అభిషిక్త్ కిషోర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని శ్రీ సాయి ఇంజిరింగ్ కళాశాలలో సాధారణ ఎన్నికల కోసం ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను ఎస్పీ కృష్ణారావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లలో విద్యుత్ సౌకర్యం, సీసీటీవీ కెమెరాలను అమర్చడంతోపాటు బారికేడింగ్ పటిష్టంగా ఉండాలన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌ల దగ్గర కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తుతో నిరంతరం నిఘా ఏర్పాటు చేస్తామన్నారు.

మోహినీ అలంకారంలో.. జగన్మోహనుడు

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు ఆదివారం ఉదయం మోహినీ అలంకారంలో రాముల వారు జగన్మోహనాకారుడిగా దర్శనమిచ్చాడు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు స్వామి వారి ఊరేగింపు వైభవంగా జరిగింది. భక్తజన బృందాలు కోలాటాలతో స్వామి వారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామి వారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఉదయం 11 నుంచి 12 వరకు ఆలయంలో స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. తిరిగి సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు ఊంజల్ సేవ వైభవంగా నిర్వహించారు. అనంతరం రాత్రి 7 గంటల నుంచి గరుడ సేవ వైభవంగా జరిగింది. రామయ్య పురవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. గరుడ సేవ నృత్యాలు, కోలాటాలు, భజనల నడుమ కోదండ రాముడి ఊరేగింపు కనుల పండువగా సాగింది.



మోహినీ అలంకారంలో మాఢవీధుల్లో ఊరేగుతున్న శ్రీరాముడు

బ్రహ్మోత్సవాల్లో నేడు: శ్రీ కోదండ రామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఆరవ రోజు సోమవారం ఉదయం 7:30 నుంచి 9:30 గంటల వరకు శివధనుర్భంగాలంకారం, అనంతరం 11 నుంచి 12 గంటల వరకు స్నపన తిరుమంజనం ఉంటుంది. తిరిగి మధ్యాహ్నం 3:15 నుంచి 4:30 గంటల వరకు కాంతకోరిక, 4:30 నుంచి 5:00 గంటల వరకు ఎదుర్కోలు ఉత్సవం, 6:30 నుంచి 8:30 వరకు కల్యాణోత్సవం, 9:15 నుంచి 10:15 వరకు గజవాహనం, 11:00 నుంచి 11:15 గంటలకు ఏకాంత సేవ నిర్వహిస్తారు.

నేడు ట్రాఫిక్ ఆంక్షలు

కడప అర్బన్: ఒంటిమిట్టలో నేడు సీతారాముల కల్యాణం జరగనున్న నేపథ్యంలో ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కడప నగరంలో, ఒంటిమిట్ట రహదారి, రేణిగుంట రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ తెలిపారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ట్రాఫిక్ మళ్లింపు ఈనెల 22న ఉదయం 6 గంటల నుంచే అమలులో ఉంటుందన్నారు. భక్తుల వాహనాలు మినహా ఎలాంటి ఇతర వాహనాలను అనుమతించరని తెలిపారు.

వాహనాల దారి మళ్లింపు వివరాలు..

- కడప నుంచి తిరుపతి వైపు వెళ్లే వాహనాలు కడప నగరం అలంఖాన్‌పల్లి ఇర్కాన్ జంక్షన్ నుంచి ఊటుకూరు సర్కిల్, రాయచోటి మీదుగా తిరుపతి వెళ్లాలి.
- తిరుపతి నుంచి కడప వైపు వచ్చే భారీ వాహనాలు, రవాణా వాహనాలు రేణిగుంట నుంచి వయా రాయచోటి మీదుగా కడపకు చేరుకోవాలి.
- రాజంపేట వైపు నుంచి వెళ్లే భారీ వాహనాలను రాయచోటి మీదుగా దారి మళ్లించారు.
- రాజంపేట వైపు నుంచి వచ్చే ద్విచక్ర వాహనాలు సాలాబాద్ నుంచి ఇబ్రహీంపేట, మాధవరం మీదుగా దారి మళ్లింపు.
- 15 చోట్ల పార్కింగ్ ప్రదేశాల ఏర్పాటు
- రాజంపేట వైపు నుంచి వచ్చే ద్విచక్రవాహనాలను సాలాబాద్ సమీపంలో 5 చోట్ల ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాల్లో క్రమపద్ధతిలో నిలపాలి.
- కల్యాణ వేదిక నుంచి కడప మార్గంలో 10 పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు



భద్రతా ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్న జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

పటిష్ట భద్రతా ఏర్పాట్లు: ఎస్పీ

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం నిర్వహించనున్న సీతారాముల కల్యాణం సందర్భంగా చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఆదివారం పరిశీలించారు. పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

జగన్‌మోహన్‌రెడ్డి ధైర్యం ప్రజలే

- బాబుకు ఓటేస్తే కష్టాలు కొనితెచ్చుకున్నట్లే
- మైనారిటీ రిజర్వేషన్ తొలగించే ఆలోచనలో బీజేపీ
- బీజేపీ కంటే ప్రమాదకారి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి
- సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే ఫ్యాన్‌ను ఆశీర్వదించండి
- మదనపల్లె ఎన్నికల ప్రచారంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి



బహిరంగసభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్రంలో ఎంపీ మిథున్‌రెడ్డి

మదనపల్లె: ఎన్నికల ముందు జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన సంక్షేమం, అభివృద్ధి పథకాలన్నింటినీ పూర్తి స్థాయిలో అమలు చేశాకే ప్రజల ముందుకు వస్తున్నారని, నేను మంచి చేసి ఉంటేనే మీరందరూ సహకరించండని అడుగుతున్నారంటే ఆయన ధైర్యం ప్రజలేనని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన మదనపల్లె నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. రామసముద్రం, మదనపల్లె టౌన్, నిమ్మనపల్లెలో ఏర్పాటు చేసిన బహిరంగ సభల్లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ శ్రేణుల నుంచి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఘనస్వాగతం లభించింది. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, పీకేఎం-ఉడా చైర్మన్ వెంకటరెడ్డియాదవ్, ఏపీఎండీసీ చైర్‌పర్సన్ షమీంఅస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్న సమావేశంలో ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా, మరే ముఖ్యమంత్రి చేయని విధంగా ప్రమాణస్వీకారం చేసిన మరుసటిరోజే..ఎన్నికల హామీలను నెరవేర్చేందుకు, మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించాలని చెప్పిన వ్యక్తి జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. కరోనాతో రెండేళ్లు ఇబ్బందులు పడ్డా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చారన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు 100 పేజీల మేనిఫెస్టోలో 600 హామీలను ఇచ్చారని, వాటిలో ఏ ఒక్కటి అమలుచేయకపోగా... కుట్రపూరితంగా అధికారంలోకి రావాలని, నేడు సూపర్ సిక్స్ పేరుతో, ప్రజల ముందుకు వస్తున్నాడన్నారు. అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించాలన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన... చంద్రబాబు నాయుడుకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. 1వతేదీన ఠంచనుగా వలంటీర్ వ్యవస్థ ద్వారా అవ్వాతాతలకు పింఛన్ అందిస్తుంటే..నిమ్మగడ్డ రమేష్ ద్వారా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయించి, 45 మంది వృద్ధుల చావుకు కారకుడయ్యాడన్నారు. చంద్రబాబు సూపర్‌సిక్స్ హామీలను నమ్మితే...కష్టాలను కొనితెచ్చుకున్నట్లేనని, బాబు హామీలను నమ్మవద్దని, ఏం చెప్పినా చేసే పరిస్థితి లేదన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి 15రోజుల క్రితం మహానేత వైఎస్సార్ ప్రవేశపెట్టిన మైనారిటీ రిజర్వేషన్ తీసేస్తామని చెప్పిందని, ఇదే విషయాన్ని తెలంగాణ ఎన్నికల్లో అమిత్‌షా ప్రస్తావించారన్నారు. మైనారిటీలకు అండగా ఉన్న 4శాతం రిజర్వేషన్‌ను బీజేపీ తొలగించే ఆలోచనలో ఉందని, సీఏఏ అమలు జరిగితే వారికి ఓటుహక్కు లేకుండా చేసేస్తారన్నారు. మైనారిటీల సంక్షేమం వైఎస్సార్ సీపీతోనే సాధ్యమన్నారు. రాజంపేట పార్లమెంటుకు బీజేపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న నల్లారి కిరణ్ దుర్మార్గుడని, ఆయన కారణంగానే రాష్ట్రం రెండుముక్కలైందని, కాంగ్రెస్ నామరూపాలు లేకుండా పోయిందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబానికి, కాంగ్రెస్‌కు, రాష్ట్రానికి నమ్మకద్రోహం చేసిన వ్యక్తి.. రాజంపేట ఎంపీగా పోటీచేస్తున్నాడని, బీజేపీ కంటే ప్రమాదకారి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి అని అన్నారు. రాజంపేట ఎంపీ అభ్యర్థిగా మూడోసారి మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యే అభ్యర్థిగా నిసార్‌అహ్మద్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉదయ్‌కుమార్, మున్సిపల్ వైస్‌చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం, దేశాయ్ జయదేవరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, దండు కరుణాకర్‌రెడ్డి, తట్టి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి కొనసాగాలంటే..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మదనపల్లె నియోజకవర్గం గణనీయమైన అభివృద్ధిని సాధించిందని ఎంపీ మిథున్‌రెడ్డి అన్నారు. ప్రతి ఇంటికీ, గ్రామానికీ నీరుఇచ్చేలా ప్రారంభించిన పథకాలు పూర్తవ్వాలంటే జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. హంద్రీ-నీవా సామర్థ్యం మూడింతలు పెంచి, సాగు, తాగునీటి కష్టాలు తీరాలంటే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాలన్నారు.

రామసముద్రానికి హంద్రీనీవా జలాలు

రామసముద్రం: రామసముద్రం మండలానికి త్వరలోనే హంద్రీ- నీవా జలాలు తీసుకొచ్చి ప్రజలను ఆదుకుంటామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం అంబేద్కర్ సర్కిల్ లో నిర్వహించిన ఎన్నికల సభలో మంత్రి మాట్లాడుతూ కిరణ్ కుమార్‌రెడ్డి ఢిల్లీ పెద్దల కాళ్లు పట్టుకొని నాడు ముఖ్యమంత్రి అయ్యారన్నారు. జిల్లాలో నాడు ఇద్దరు ముఖ్యమంత్రులుగా పని చేసి కూడా ఏమి అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. మండలానికి హంద్రీనీవా కాలువ మంజూరైందని ఒక సంవత్సరంలో మండలానికి నీళ్లు వస్తాయన్నారు. మదనపల్లి- రామసముద్రం డబుల్ రోడ్డు కూడా మంజూరైందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే దేశాయి తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నరేష్ కుమార్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు బీఫారాల అందజేత



మంత్రి చేతుల మీదుగా బీ-ఫాం అందుకుంటున్న అభ్యర్థి నిసార్ అహ్మద్

మదనపల్లె: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వైఎస్సార్ సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం 'బి' ఫారాలను అందజేశారు. వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మదనపల్లె పర్యటనలో ఉన్న మంత్రి పెద్దిరెడ్డి మిషన్ కాంపౌండ్‌లోని బహిరంగ సభలో ప్రజలందరి సమక్షంలో అభ్యర్థులకు బీ ఫారాలు అందజేశారు. బీఫారాలు అందుకున్న వారిలో చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, కుప్పం ఎమ్మెల్యే అభ్యర్థి భరత్, పలమనేరు అభ్యర్థి వెంకటేగౌడ, పూతలపట్టు అభ్యర్థి డాక్టర్.సునీల్‌కుమార్, మదనపల్లె అభ్యర్థి నిసార్‌అహ్మద్ ఉన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి తరపున ఆయన భార్య బీ ఫారం అందుకున్నారు. బీ ఫారాలను తీసుకునే క్షణంలో అభ్యర్థులు ఒకింత ఉద్వేగానికి లోనయ్యారు. చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, మదనపల్లె ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్‌లు బీ ఫారాలు తీసుకునే ముందు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పాదాభివందనం చేసి ఆశీస్సులు అందుకున్నారు. బీ ఫారాలు అందుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ఆల్ ది బెస్ట్ అంటూ అభినందనలు తెలిపారు.

క్లుప్తంగా

భర్తను చంపిన భార్య అరెస్ట్

బి.కొత్తకోట : భర్తను హత్య చేసిన కేసులో భార్యను ఆదివారం అరెస్ట్ చేశామని సీఐ సూర్యనారాయణ తెలిపారు. బి.కొత్తకోట మండలం కోటావూరు పంచాయతీ చవటకుంటపల్లెకు చెందిన ఇడగొట్టు వెంకటరమణ (55), రెడ్డెమ్మ (40) భార్యాభర్తలు. రెడ్డెమ్మ ప్రవర్తన కారణంగా వీరి మధ్య విభేదాలు, గొడవలు జరుగుతూ ఉండేవి. ఈ నేపథ్యంలో ఈనెల 17న వెంకటరమణను భార్య రెడ్డెమ్మ, కుమారుడు గంగాధర్ గొంతు నులిమి హత్య చేశారని మృతుని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితురాలైన రెడ్డెమ్మను మండలంలోని కాండ్లమడుగు వద్ద అరెస్ట్ చేసినట్టు సీఐ తెలిపారు.

ప్రమాదంలో డ్రైవర్ మృతి

ముద్దనూరు : స్థానిక కడప రహదారి లో 4రోడ్ల సమీపంలో ప్రమాద వశాత్తు షేక్షా వల్లి (38)అనే డ్రైవర్ మృతి చెందాడు.. సీఐ దస్తగిరి సమాచారం మేరకు ముద్దనూరు కు చెందిన షేక్షా వల్లి లారీ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. లారీ మరమ్మతులు చేసుకుంటుండగా ఆదివారం లారీ పై నుంచి జారి పడ్డాడు. ఈ ప్రమాదం లో తీ వంగా గాయపడిన వల్లి ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి కి తరలించారు. చికిత్స పొందుతూ అక్కడే వల్లి మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి


గాయపడిన రాధాక్రిష్ణారెడ్డి

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని కొంగలవీడు చెరువు కట్ట వద్ద ఓ యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బద్వేలుకు చెందిన జమ్మన రాధాక్రిష్ణారెడ్డి సొంత పని నిమిత్తం కోనసముద్రంకు వెళ్ళి కొంగలవీడు మీదుగా తిరిగి బద్వేలుకు వస్తున్న సమయంలో కొంగలవీడు చెరువు కట్ట వద్దకు వచ్చేసరికి ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు రాధాక్రిష్ణారెడ్డి ద్విచక్ర వాహనాన్ని ఆపి డబ్బులు ఇవ్వమని బెదిరించారు. తన వద్ద డబ్బులు లేదని చెప్పగా జేబులో ఉన్న సెల్‌ఫోన్ లాక్కొని అతనిపై బీరుబాటిల్‌తో దాడిచేశారు. దీంతో రాధాక్రిష్ణారెడ్డి తలకు గాయమైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

బైక్ బోల్తా - వ్యక్తి మృతి


మృతిచెందిన మహబూబ్‌బాషా

బి.కోడూరు : మండలంలోని ఐత్రంపేట గ్రామ సమీపాన ఆదివారం సాయంత్రం బైక్ అదుపు తప్పి కింద పడిన ఘటనలో బద్వేలు శివానగర్‌కు చెందిన మహబూబ్‌బాష (38) మృతిచెందాడు. బి.కోడూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మహబూబ్‌బాష ఓ పని నిమిత్తం మోటారుబైక్‌లో తన భార్యతో కలిసి పోరుమామిళ్ళకు వెళ్ళి పని ముగించుకుని తిరిగి వస్తుండగా ఐత్రంపేట గ్రామ సమీపాన మోటారు బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో మహబూబ్‌బాష అక్కడికక్కడే మృతిచెందగా అతని భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు బి.కోడూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పోరుమామిళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఉన్నది ఒకటే జిందగీ..

- మార్కులు విజయానికి కొలమానం కాదు
- మనిషిలో దాగివుండే ప్రతిభ ముఖ్యం
- నేడు టెన్త్ ఫలితాలు విడుదల
- ఫలితం ఏదైనా ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలి

'సచిన్ పదో తరగతి ఫెయిల్ అయ్యారు. అయితేనేం క్రికెట్ లోకానికే వన్నె తెచ్చారు. దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చారు.'

'అబ్దుల్ కలాంకు మార్కులు ఎక్కువగా వచ్చేవి కావు. కానీ చదవడం, నేర్చుకోవడం అంటే ఆయనకు మక్కువ. అదే గొప్ప స్పేస్ శాస్త్రవేత్తను, మన దేశానికి రాష్ట్రపతిని చేసింది. భారతరత్నను తెచ్చి పెట్టింది.'

'ప్రముఖ గాయని లతా మంగేష్కర్ ఎప్పుడూ స్కూల్‌కు వెళ్లలేదు. అయినా పాటల తోటలో గాన కోకిలగా కీర్తి గడించారు.'


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

రాజంపేట టౌన్/మదనపల్లె సిటీ : విద్యార్థులంతా అత్యుత్తమ మార్కులు తెచ్చుకోలేక పోవచ్చు.. అలాగే కొంత మంది విద్యార్థులు కొన్ని సబ్జెక్ట్‌లలో ఫెయిల్ కూడా కావచ్చు. మార్కులు తక్కువ వచ్చాయనో లేక ఉత్తీర్ణత సాధించలేక పోయామనో విద్యార్థులు ఆత్మహత్య చేసుకుందామన్న ఆలోచన ఏకోసాన కూడా మదిలోకి రానివ్వకూడదు.

- మనిషి ఉజ్జల భవిష్యత్తుకు మార్కులు, ఉత్తీర్ణత వంటివి ఏమాత్రం కొలమానం కాదు. ప్రతి మనిషిలో ఏదో ఒక ప్రతిభ ఉంటుంది. కొంతమంది చదువులో ప్రావీణ్యం చూపగలరు. మరికొంత మంది క్రీడల్లో, ఇంకొంతమంది వ్యాపారంలో ఇతర రంగాల్లో ప్రావీణ్యం చూపుతారు. అంతిమంగా మనిషి ఎంచుకున్న రంగంలో బాగా రాణించి ఉజ్వల భవిష్యత్తును ఆస్వాదించడమే జీవితమని విద్యావంతులు చెబుతున్నారు.
- పదవతరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలు సోమవారం విడుదల కానున్నందున ప్రతికూల ఫలితాలు వచ్చినా విద్యార్థులు ఆత్మస్థైర్యంతో మరింత కసిగా, పట్టుదలతో చదివి సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యేందుకు కృషి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే టెన్త్ ఫలితాలు విడుదలవుతున్న సందర్భంగా తల్లిదండ్రులు తమ పిల్లలతో ఓ స్నేహితుల్లా ఉండాలని విద్యావంతులు సూచిస్తున్నారు.

తల్లిదండ్రులు ఇలాంటి మాటలు మాట్లాడకూడదు..

- నీకు మార్కులు తక్కువ వచ్చాయి....మేము ఎలా తలెత్తుకోవాలి అన్న మాటలు అస్సలు మాట్లాడ కూడదు.
- ఈ మార్కుల కోసమా మేము వేలు, లక్షలు పోసి చదివించింది అని దెప్పిపొడవకూడదు.
- పాస్ కాలేనప్పుడు బతికి ఏం లాభం అంటూ కోప్పడే మాటలు చాలా ప్రమాదకరం.
- బంధువులకు చెప్పుకోవడానికి కూడా లేకుండా మార్కులు తెచ్చుకున్నావు అంటూ తక్కువ చేసి మాట్లాడకూడదు.
- ఫలానా వాళ్ళ పిల్లలను చూసి సిగ్గుతెచ్చుకో అంటూ తమ పిల్లలను తక్కువ చేసి కించపరచరాదు.

ఫలితాలు విడుదలయ్యే సమయంలో ఇలా చేయాలి..

- ఫలితాలు విడుదలయ్యే సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు దగ్గరగా ఉండాలి.
- ఫలితాలు వచ్చే సమయం దగ్గర పడేకొద్ది కొంత మంది విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతుంటారు, అలాంటి తరుణంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు ధైర్యం చెప్పాలి. మార్కులు తక్కువ వచ్చినా, ఒక వేళ ఫెయిల్ అయినా మళ్ళీ బాగా చదివి మంచి మార్కులతో పాస్ అవుతావులే అన్న ధైర్యం కల్పించే మాటలు చెప్పాలి.
- తక్కువ మార్కులు వచ్చినా, ఫెయిల్ అయినా తల్లిదండ్రులు పెదాలపై చిరునవ్వుతో తమ పిల్లలతో మాట్లాడాలి.
- ఫలితాల సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లలతో స్నేహితుల్లా ఉండాలి.

పిల్లలు ఇలా ఉంటే ఒక కంట కనిపెట్టండి..

- టెన్త్ విద్యార్థులందరిది కౌమారదశనే. అందువల్ల వారి మనస్సు చాలా సున్నితంగా ఉంటుంది. చిన్న సమస్యను కూడా ఆ వయస్సు పిల్లలు భూతద్దంతలో చూస్తారు. ఈకారణంగా ఫలితాలు విడుదలయ్యాక తక్కువ మార్కులు వచ్చినా, ఫెయిల్ అయినా పిల్లలను తల్లిదండ్రులు ఓకంట కనిపెట్టి ఉండటం మంచిది.
- పిల్లలు ముభావంగా ఉంటే తల్లిదండ్రులు వారి పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలి.
- ఆహారం తీసుకోక పోయినా, ఏదో ఆలోచిస్తూ ఉన్నట్లు ఉన్నా పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి.
- ముఖ్యంగా ఫెయిల్ అయిన వారిని ఒంటరిగా ఉంచ కూడదు.
- ఎక్కువ మార్కులు వస్తాయని భావించి తక్కువ మార్కులు వచ్చిన వారిని, అలాగే ఫెయిల్ అయిన వారిని ఏదైనా పిక్నిక్ వంటి ప్రదేశాలకు తీసుకెళితే వారి ఆలోచన మారుతుంది.

తల్లిదండ్రులు ఇవి పాటించాలి



పది ఫైల్ అయిన విద్యార్థుల పట్ల కఠినంగా వ్యవహరించవద్దు. వారితో ప్రేమగా మాట్లాడి లోపం ఎక్కడ జరిగిందో తెలుసుకోవాలి. తీవ్రంగా బాధపడితే కౌన్సెలింగ్ ఇప్పించడం మేలు. పరీక్షలో తప్పి, ఆ తర్వాత ఉన్నత స్థాయికి వెళ్లిన వారి గురించి చెప్పాలి.

– చాముండేశ్వరి, మానసిక నిపుణురాలు, మదనపల్లె

మరో అవకాశం ఉంది..



ప్రతికూల ఫలితాలు వచ్చిన విద్యార్థులు ఆందోళన చెందవద్దు. క్షణికావేశంలో ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోకూడదు. ఈ పరీక్షా ఫలితాలు జీవితంలో ఫైనల్ పరీక్షలేమి కాదనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. ఫెయిల్ అయితే ఏడాది నష్టపోకుండా సత్తా చాటుకునే అవకాశం కూడా ఉంది. చిన్నచిన్న వాటికి బాధపడి ఆత్మహత్యలు చేసుకునేందుకు తల్లిదండ్రులు మనకు జన్మనివ్వలేదు. శక్తిసామర్థ్యాలతో భవిష్యత్తులో ఒక విజేతగా, ఆదర్శ వ్యక్తిగా ఎదగాలన్నదే తల్లిదండ్రుల కోరిక. విద్యార్థుల లక్ష్యం అదే కావాలి. అందుకోసం ఏ సమస్య వచ్చినా వెనకడుగు వేయకుండా ముందుకు సాగాలి. ప్రతికూల ఫలితాలు వచ్చినా తల్లిదండ్రులు తమ పిల్లల్ని నిందించకూడదు. ఇంతటితో చదువు ఆగిపోదు, పరీక్షలు ఆగిపోవు అన్న ఆత్మస్థైర్యాన్ని తల్లిదండ్రులు తమ పిల్లల్లో నింపాలి.

– మునగాల కృష్ణకుమార్, రిటైర్డ్ డిప్యూటీ ఈఓ, రాజంపేట

ఏఎస్ఐకి తీవ్ర గాయాలు

మదనపల్లె : తంబళ్లపల్లె ఎన్నికల విధులకు వెళుతున్న మదనపల్లె ట్రాఫిక్ ఏఎస్ఐ సుబ్రమణ్యంకు ఆదివారం వడదెబ్బ తగిలింది. ఏఎస్ఐ సుబ్రమణ్యం ఎన్నికల విధుల్లో భాగంగా ద్విచక్రవాహనంపై తంబళ్లపల్లెకు బయలుదేరాడు. ఈ క్రమంలో ఎండ వేడిమి ఎక్కువ కావడంతో కురబలకోట మండలం ముదివేడు క్రాస్ వద్ద వడదెబ్బతో ద్విచక్రవాహనం నడపలేక కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు కారులో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు.

కాంగ్రెస్ పార్టీకి యూత్ కాంగ్రెస్ వెన్నెముక

కడప వైఎస్ఆర్ సర్కిల్ : అఖిల భారత కాంగ్రెస్ పార్టీకి ఇండియన్ యూత్ కాంగ్రెస్ వెన్నెముకలా ఉంటుందని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల గుర్తించాలని కడప జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి సుమంత్ కుమార్ తెలిపారు. ఆదివారం నగరంలోని యూత్ కాంగ్రెస్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వాసి పీసీసీ అధ్యక్షురాలు షర్మిల జిల్లాలో కొంతమంది నాయకుల మాటలు విని కడప జిల్లా యూత్ కాంగ్రెస్‌ను కలుపుకోకుండా కార్యక్రమాలు నిర్వహించుకోవడం సబబు కాదని తెలిపారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

మైదుకూరు : చైత్ర పౌర్ణమి సందర్భంగా అరుణాచలానికి మైదుకూరు డిపో నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సూపర్ లగ్జరీ బస్సు ఈనెల 23న ఉదయం 6 గంటలకు మైదుకూరు నుండి బయల్దేరి కాణిపాకం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ మహాలక్ష్మి అమ్మవారి దర్శనం, అనంతరం అరుణాచలం చేరుకుంటుందన్నారు. అరుణాచలంలో బస అనంతరం 24వ తేదీ గిరి ప్రదక్షిణ, అరుణాచలేశ్వరుని దర్శనం అనంతరం అదే రోజు రాత్రికి బస్సు మైదుకూరు చేరుతుందని వివరించారు. రిజర్వేషన్‌తో కలిపి చార్జీ రూ.1380 చెల్లించాలని తెలిపారు. మరొక సూపర్ లగ్జరీ బస్సు 24వ తేదీ ఉదయం 7 గంటలకు మైదుకూరు నుంచి నేరుగా అరుణాచలం బయలుదేరుతుందని పేర్కొన్నారు. అరుణాచలంలో గిరి ప్రదక్షిణ, అరుణాచలేశ్వరుని దర్శనం అనంతరం రాత్రికి మైదుకూరు చేరుకుంటుందన్నారు. రిజర్వేషన్‌తో చార్జీ రూ.1,110 అవుతుందని, భక్తులు 9885448199 నంబరులో సంప్రదించి రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు.

నెరవేరిన పేద రోగుల కల


నూతనంగా ఏర్పాటైన రాజంపేట డయాలసిస్ సెంటర్

- రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు మహర్దశ
- ఇటీవలే హృదయ రోగుల కోసం స్టెమీ సెంటర్
- నేడు కిడ్నీ రోగుల కోసం డయాలసిస్ సెంటర్ అందుబాటులోకి

రాజంపేట : పేదలకు మెరుగైన వైద్య సేవలందించడమే ప్రభుత్వ ఆశయం. ఆ దిశగా రాజంపేటలో నాడు– నేడు కింద రూ. 22 కోట్లతో వంద పడకల సామర్థ్యం కలిగిన ఆధునిక భవనాలు అందుబాటులోకి తీసుకువచ్చారు. గుండె జబ్బులున్నవారిని కాపాడడం కోసం ఇటీవల స్టెమీ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం.. కిడ్నీ రోగుల ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు డయాలసిస్ సెంటర్‌ను నేడు అందుబాటులోకి తేనుంది. దీంతో పేద ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మొన్న స్టెమీ..

హార్ట్ అటాక్ వచ్చిన తరుణంలో వెను వెంటనే ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్టెమీ సెంటర్‌కు వెళితే, అక్కడ వైద్యులు ఈసీజీలు తీసి , వెను వెంటనే సంబంధిత కార్డియాలజి నిపుణులకు సమాచారం ఇస్తారు. అక్కడ హార్ట్ అటాక్ నిర్ధారించుకొని ఇంజక్షన్ వేయాలని ఆదేశిస్తారు. ఇంజక్షన్ ఇచ్చిన తర్వాత మెరుగైన వైద్యం కోసం కార్డియాలజి వైద్యుల వద్దకు తీసుకెళ్లే పరిస్థితులు ఉంటాయి. ఆ తర్వాత గుండె పోటును తప్పించుకున్నవారవుతారు. రూ.50వేలు విలువ చేసే ఇంజక్షన్ రాజంపేట హాస్పిటల్‌లో అందుబాటులో ఉంచారు.

నేడు కిడ్నీరోగుల కోసం డయాలసిస్ సెంటర్

కిడ్నీ రోగుల కోసం రాజంపేట ప్రాంతీయవైద్యశాలలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటుచేశారు. ఆధునిక భవనాల సముదాయంలో ఫస్ట్‌ఫ్లోర్‌లో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటుచేశారు. ప్రస్తుతానికి ఐదు బెడ్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. రానున్న రోజుల్లో బెడ్స్ సంఖ్య పెంచుతారు. సోమవారం ఈ డయాలసిస్ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకువస్తారు. కిడ్నీ రోగులకు ఈ వైద్యం ఉపయుక్తంగా ఉంటుంది.

టీడీపీకి ఇవే చివరి ఎన్నికలు

- నిమ్మనపల్లె ఎన్నికల ప్రచార సభలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- కిరణ్ కుమార్ రెడ్డికి డిపాజిట్ రాకుండా చేయండి
- ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించండి
- బహుదా ప్రాజెక్టుకు హంద్రీనీవా జలాలు తెస్తామని హామీ


నిమ్మనపల్లె బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

నిమ్మనపల్లె : ప్రతిపక్ష టీడీపీకి ఇవే చివరి ఎన్నికలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం నిమ్మనపల్లె సింగల్ విండో కార్యాలయం వద్ద ఎన్నికల బహిరంగ సభ లో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్యే దేశాయి తిప్పారెడ్డిలతో కలసి పాల్గొన్నారు. రాచవేటి వారి పల్లె వద్ద సీనియర్ నాయకులు గార బురుజు రమణారెడ్డి, నిమ్మనపల్లెలో వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ సదాశివరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మేపల్లి శ్రీనివాసులు రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు రెడ్డి శేఖర్ రెడ్డిలు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కి ఘన స్వాగతం పలికారు. బస్టాండ్ నుంచి బహిరంగ సభ వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం బహిరంగ సభలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎన్నికలలో వైఎస్ఆర్‌సీపీని ప్రజలందరూ విజయపథంలో నడపాలన్నారు. గత ఎన్నికల సమయంలో ప్రకటించిన మేనిఫెస్టో పూర్తిస్థాయిలో అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ప్రత్యక్షంగా పరోక్షంగా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిందన్నారు. హంద్రీనీవా నీటిని నిర్మాణంలో ఉన్న కొత్త రిజర్వాయర్లతోపాటు, నిమ్మనపల్లెలోని బహుద ప్రాజెక్టుకు అందిస్తామన్నారు. ప్రాజెక్టు నిర్మాణాలను అడ్డుకుంటూ చంద్రబాబు కోర్టుకు వెళ్లి స్టే తెచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పాటవగానే ఏడాదిలోపు ప్రాజెక్టు నిర్మాణాలు పూర్తి చేసి సాగునీరు అందిస్తామన్నారు. మండలంలో పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణం జరిగిందన్నారు. నిమ్మనపల్లె-మదనపల్లె డబుల్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. 600 హామీలు ఇచ్చిన చంద్రబాబు ప్రజలను పూర్తిగా మోసం చేశారని.. ఇప్పుడు మళ్లీ మోసపూరిత హామీలతో సూపర్ సిక్స్ అంటూ వచ్చాడన్నారు. బాబు మాయ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుందామని, ప్రజలందరూ అండగా నిలవాలన్నారు. ఎంపీగా మిథున్ రెడ్డి, ఎమ్మెల్యేగా నిసార్ అహ్మద్‌ను గెలిపించుకోవాలన్నారు. టీడీపీ అభ్యర్థి షాజహాన్ బాషను తానే రాజకీయాల్లోకి తెచ్చానని.. అయితే ఆయన టీడీపీలో చేరి నీతిమరచి మాట్లాడుతున్నాడని ప్రజలంతా గమనించాలన్నారు. రాష్ట్ర విభజనతో లబ్ధి పొందాలని అప్పటి కేంద్ర మంత్రి చిదంబరంతో చీకటి ఒప్పందం చేసుకున్న కిరణ్ కుమార్ రెడ్డికి ఎన్నికల్లో డిపాజిట్ రాకుండా ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు.

ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ వైఎస్ఆర్ జిల్లా గండికోట రిజర్వాయర్ నుంచి పైప్‌లైన్ ద్వారా నీరు తెచ్చి పశ్చిమ నియోజకవర్గం పీలేరు, తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరుకు తాగునీరు అందిస్తామన్నారు. వాటర్ గ్రిడ్ పథకాన్ని ఎంతో గొప్ప మనసుతో సీఎం వైఎస్ జగన్ మంజూరు చేశారన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ నరసింహులు, మండల పార్టీ కన్వీనర్ సదాశివరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మేపల్లి శ్రీనివాసులురెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రెడ్డి శేఖర్ రెడ్డి , ఆర్బీకే చైర్మన్ ప్రవీణ్ కుమార్ రెడ్డి, మదనపల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ జింక వెంకటాచలపతి, నాయకులు రమణారెడ్డి, సాయి ప్రసాద్ రెడ్డి రఘునాథరెడ్డి, యుగంధర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఐక్యతకు ప్రతీక.. గఫ్ఫారియా దర్గా

- నేటి నుంచి కమలాపురం దర్గా ఉరుసు
- 22న నషాన్, 23న గంధం, 24న ఉరుసు, 25న తహలిల్


హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి దర్గా


స్వామి వారి మజార్లు

కమలాపురం: మతసామరస్యానికి.. ఐక్యతకు కమలాపురం పెద్ద దర్గా ప్రతీకగా నిలుస్తోంది. కమలాపురం పట్టణంలో వెలసిన దర్గా–ఏ–గఫారియా, ఖాదరియా, జహీరియా భక్తుల కొంగు బంగారంగా విలసిల్లుతోంది. దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధి చెందిన ఈ దర్గాలో వెలసిన హజరత్ అబ్దుల్ గఫార్‌షాఖాద్రి, హజరత్ దస్తగిరిషాఖాద్రి, హజరత్ మౌలానా మౌల్వి ఖాదర్ మొహిద్దీన్ షా ఖాద్రి , హజరత్ జహీరుద్దీన్ షాఖాద్రి ఖుద్దస సిర్రహుంవార్లు వెలసి ఉన్నారు. ఏటా ఈ ఉరుసు మహోత్సవాలు అంగరంగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పీఠాధిపతి హజరత్ హాజి జహీరుద్దీన్ షా ఖాద్రి పరమ పదించిన తర్వాత ఆయన వారసులు, ముతవల్లి సజ్జాదె–ఏ–నషీన్ హజరత్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి, వారి సోదరుల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 22 నుంచి నాలుగు రోజుల పాటు ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు దర్గా కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. 22వ తేదీన నషాన్‌తో 104వ ఉరుసు మహోత్సవాలు ప్రారంభమై, 23న గంధం, 24న ఉరుసు, 25న తహలిల్‌తో కార్యక్రమాలు ముగుస్తాయి. ఉరుసు ఉత్సవాలకు దర్గా సుందరంగా ముస్తాబు అవుతోంది. రాష్ట్రం నలుమూలల నుంచే కాక తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలి రానున్నారు. భక్తుల సౌకర్యార్థం ముతవల్లి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు.

మతసామరస్యానికి ప్రతీక:

హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి దర్గాను హిందువులే నిర్మించడంతో ఈ దర్గా మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. హజరత్ దస్తగిరి షా ఖాద్రికి ముఖ్య శిష్యుడుగా ఉన్న నామా నాగయ్య శ్రేష్టి ధర్మకర్తగా కొనసాగారు.

అలరించే ఖవ్వాలి : ఉరుసును పురస్కరించుకొని దర్గా ప్రాంగణంలో గంధం, ఉరుసు రెండు రోజుల పాటు గొప్ప ఖవ్వాలి పోటీ నిర్వహించ నున్నారు. ఈ ఏడాది ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రాజస్థాన్‌కు చెందిన సలీం సాబిరి, ముంబయికి చెందిన కలీమ్ నయామ్ హష్మిల మధ్య ఖవ్వాలి పోటీ జరగనుంది.

24న బండలాగుడు పోటీలు:

ఉరుసు మహోత్సవాలను పురస్కరించుకొని ఈ నెల 24న దర్గా ప్రాంగణంలో పాల దంతాలు కలిగిన వృషభ రాజములచే చిన్న బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.30వేలు, తృతీయ బహుమతి రూ.20వేలు, నాల్గవ బహుమతి రూ.10వేలు ఇవ్వనున్నారు. పోటీల్లో పాల్గొనే ఎడ్ల యజమానులు 24వ తేదీ ఉదయం 7గంటల్లోపు దర్గా–ఏ–గఫారియా ఆఫీసులో లేదా 97011 23459, 81219 96786 నెంబర్‌కు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

దర్గా విశిష్టత

కర్ణాటక రాష్ట్రంలోని బెల్గాం నుంచి మత ప్రబోధనలు చేస్తూ వచ్చిన హజరత్ అబ్దుల్ గఫార్ షా ఖాద్రి 1916లో కమలాపురానికి వచ్చి స్థిర పడ్డారు. ఆయన తన భక్తులకు బోధనలు చేస్తూ ఎన్నో మహిమలు చూపారు. దీంతో ఈ ప్రాంతంలో చాలా మంది ఆయనకు శిష్యులుగా మారారు. ఈ నేపథ్యంలో పరిపూర్ణులై విరాజిల్లుతున్న గఫార్ షా ఖాద్రి తన ప్రియ శిష్యుడైన దస్తగిరిషా ఖాద్రికి గురుత్వం బోధించి 1924 జనవరి 10న సమాధి అయ్యారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దస్తగిరిషా ఖాద్రి వంశీయులే పీఠాధిపతులుగా కొనసాగుతున్నా రు. దాదాపు 50ఏళ్లకు పైగా పీఠాధిపతిగా కొనసాగిన హజరత్ హాజీ జహీరుద్దీన్ షా ఖాద్రి వలీఅల్లాగా ప్రసిద్ధికెక్కారు. ఆయన ఇటీవల స్వర్గస్తులయ్యారు. దీంతో ఆయన కుమారుడు ఫైజుల్ గఫార్‌షా ఖాద్రి గురుతర బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

కమలాపురం దర్గా సన్నిధిలో ఎంపీ

కమలాపురం పెద్ద దర్గాను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సందర్శించారు. ఉరుసు మహోత్సవాలు జరగనున్న నేపథ్యంలో దర్గా కన్వీనర్ షేక్ ఇస్మాయిల్ ఆహ్వానం మేరకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదివారం దర్గాను సందర్శించారు. ఎంపీ రాకను పురస్కరించుకుని దర్గా నిర్వాహకులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ఎంపీ దర్గా చేరుకుని స్వామి వారిని దర్శించుకుని పూలచాదర్ సమర్పించి ప్రత్యేక ఫాతెహా నిర్వహించారు.వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, సీఎస్ నారాయణరెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి పాల్గొన్నారు.


పీఠాధిపతితో ఉరుసు నిర్వహణ గురించి మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి